





# సయొనారా

ప్రేమించిన చక్కటి అమ్మాయి కళ్ళల్లోంచి కురిసే చిక్కటి వెలుగులాంటి వెన్నెల జాలు వానగా కురిపిస్తున్న పున్నమి చంద్రుణ్ని, ఆ అమ్మాయిని అదుపులో పెట్టడానికి ప్రయత్నించే ముసిలి తండ్రిలాగ, నల్లటి మేఘం వొకటి నిండా కప్పేసింది. అంచేత ఆకాశంలో చంద్రుడు షేడ్ చాటున టేబుల్ లైటులా వున్నాడు. చాలని చిరువెన్నెల పరుచుకున్న భూమిమీద పల్చని చీకటి మసగ్గా వ్యాపించివుంది.

ఇప్పుడు 'రామక్రిష్ణా మిషన్ బీచ్'లో వెన్నెల పున్నమినాటిలా లేదు. జనం "అప్పుడే చీకటి పడిన శనివారంలా లేరు. "స్కాండల్ పాయింట్" దగ్గర వేడిప్రేమ జనించే సూచనలు కూడాలేవు. ఇవేం లేక పోయినా, అక్కడ మాత్రం దేశంలో దరిద్రమంత సముద్రం వుంది. దాని పక్కనే రెండు ముచ్చటైన పొడుగాటి జడలుకూడా వున్నాయి. అవి చీకటి సముద్రమంత నల్లగావున్నాయి. ఆ జెళ్ళకి ఒక చివర తమాషాగా ముడి వేయబడిన రెండు సిల్కు రిబ్బన్లున్నాయి. మరో చివర తమాషాగా దిక్కులు చూస్తున్న ఒక తల వుంది. ఆ తలమీద వొత్తైన జుత్తు వుంది. ఆ జుత్తు మధ్యగా బీచ్ రోడ్డులా తిన్నటి పాపిట వుంది.

కె. వివేకానందమూర్తి

పాపిడి ప్రారంభమయిన చోటుకి దిగువగా విశాలమైన నుదురువుంది. ఆ నుదుటిమధ్య దిద్దుబాటులేకుండా తీర్చిన తిలకంబొట్టు – కాస్త క్రిందుగా, ఎడాపెడా ఒకజత పెద్ద కళ్ళు వున్నాయి. అవి యిప్పుడు ఎడాపెడా చూస్తున్నాయి. అవి రేఖ అనే నాజూకు అమ్మాయివి. అందమైన రేఖకి–బారెడు కళ్ళకి బారెడు జెళ్ళకి తోడు అందమైన చెవులు, ముక్కు, పెదాలూ, చీరె, జాకెట్టూ కూడా వున్నాయి. మూసిన పెదాల మధ్యనున్న రేఖ నోరు యిప్పుడు సన్నటి సరళరేఖలా వుంది.

కాస్సేపటి క్రితమే నిరంజనం ఆమెని వొదిలి వెళ్ళాడు కాబట్టి యిప్పుడు రేఖ వొంటరిగా చంద్రకాంతిలేని అవాళ్టి సముద్రంలా వుంది. పున్నమి చంద్రుడు మేఘం పరదానుండి వెలికి వస్తే—వెన్నెల్లో సముద్రాన్నీ బీచ్‌నీ చూసి యింటికి వెళ్ళే వుద్దేశంతో చాలాసేపు అలాగే అక్కడే నిలబడింది రేఖ. కాని చంద్రుడు ఎంతకీ బైటికి రాకుండా వున్నాడు.

పల్చని చీకటి క్రమంగా దట్టమయి వూరంతా వొళ్ళు విరిచింది.

బీచ్‌లో రేఖ తప్ప మరి మనుషులేరు. ఆమె చేతినున్న వాచ్‌లో ముళ్ళున్నా లేనట్టే వున్నాయి. అందమైన అమ్మాయి కాబట్టి రేఖకి భయం వేస్తోంది. పదో నెంబరు చివరి బస్సు యిందాకే వెళ్ళిపోయింది. నిరంజనం తోడువచ్చి యింటికి దిగబెడతా నన్నాడు. కాని తను వెన్నెల చూశాక వెళ్ళాలను కుంది. అందుకని తనొక్కతే వెళ్ళగలనంటూ ఏదో పనుందన్న నిరంజనానికి 'గుడ్‌నైట్' చెప్పేసింది. తీరా యింతసేపు చూసినా వెన్నెల రాలేదు. చీకటి పోలేదు.

ఇంతలో చినుకులు రాలడం ప్రారంభ మయింది.

కాస్సేపటికి సన్నటి వర్షం మొదలయింది.

ఈ వాతావరణంలో రేఖకి చలి కంటే భయం ఎక్కువగా వేస్తోంది. పండు వెన్నెల్లో మనోజ్ఞతకి యిరవై ఏళ్ళుగా అలవాటు పడిన రేఖకి వర్షపు చీకట్లో భయం యిదే తొలి అనుభవం.

ఆమె యిప్పుడు ఎడాపెడా చూడ్డం మానేసి, దూరంగా లాసన్స్ బే వైపున్న రెడ్‌లైట్ హౌస్‌ని తదేకంగా చూస్తోంది.

విరిగిపడే కెరటాల ధ్వని ఆమెని జడిపిస్తోంది.

విసురుగా వీచే వానగాలి ఆమెను వణికిస్తోంది.

ఇంతలో—అట్నుంచి ఏదో కారు వొకటి యిటుగా వస్తూ ఆమె నిశ్చలమైన చూపుని తనవైపు మరల్చుకొంది. హఠాత్తుగా వర్షం తగ్గిపోయి, వెన్నెల వచ్చినంత తేలిక పడింది రేఖ. తడిసిపోయే యిసుకలో గబాగబా నడిచి రోడ్డు అంచుకి వచ్చి నిలబడింది. హెడ్‌లైట్ కాంతి మీద పడగానే కారు ఆపమన్నట్టు చెయ్యూపింది. క్షణంలో కారు ఆమె పక్కగావచ్చి ఆగింది. ఆగిన వెంటనే డ్రైవింగ్ సీట్‌లో వున్న వొక్క వ్యక్తి చురుగ్గా మాట్లాడాడు.

'ఇది పదో నెంబరు బస్సుకాదు–అంబాసిడర్ కారు.'

'ప్లీజ్! హాస్పిటల్ రోడ్డువరకూ కాస్త లిఫ్టిస్తారా?' రేఖ అతన్ని ప్రాధేయ పూర్వకంగా చూసింది. అతని కళ్ళు క్షణంపాటు ఆమెని పరిశీలనగా చూశాక, అతనుమౌనంగా వంగి కారు తలుపుతీసి, కూర్చోమన్నట్టు తలవూపాడు. రేఖ 'థాంక్స్' చెప్పి ఫ్రంట్‌సీట్‌లో అతని పక్కన కూర్చుంది. అతను కారు స్టార్టు చేశాడు.

స్టీరింగుమీద దృఢంగా చేతులు మోపి రోడ్డువైపు తిన్నగా చూస్తున్నాడతను. కృతజ్ఞత నిండిన మనస్సుతో రేఖ తలపక్కకి తిప్పింది. అతని చెంపలు కనిపించాయి – వాటి బిగి పాతికేళ్ళ అతని వయస్సుని సుమారుగా సూచిస్తోంది.

అలాగే చూస్తూ అతను అడిగాడు— 'నర్సేనిటి మీరు?'

'కాదు. మెడికల్ స్టూడెంటుని–' చీరెకొంగుతో తడిముఖాన్ని తుడుచుకుంటూ అంది రేఖ.

'ఏమిటి మీ పేరు?'

'రేఖ.'

'మీకు అందమేగాని ఆలోచన లేనట్టుంది.'

రేఖ మాట్లాడలేదు. చెవిరింగుల్నీ నుదుటిమీది ముంగురుల్నీ సరిచేసుకొంటోంది.

'నాకేం నచ్చలేదు- ఇలా రాత్రి పూట వొక్కరూ వర్షంలో జనంలేని బీచ్‌లో వొంటరిమగాడి కారెక్కడం, ఎంత ధైర్యం! ఇందుకేనేమో ఆడవాళ్ళలో ధైర్యం బాగుండదనిచెప్పేడు మావయ్య!'

ఆమె వణికింది. అతనామెకేసి చూశాడు.

'మీరు చలికి వణకలేదని నాకు తెలుసు. ధైర్యం బాగుండ దన్నానని వొంట్లోకి భయం తెచ్చుకుంటున్నారులా వుంది. అయినా యిప్పుడు భయపడాల్సింది నేను. వర్షపు రాత్రి తొమ్మిది దాటాక వొంటరిగా పోయే వాడ్ని ఆపుచేసి కూడా పడ్డారు.'

---

● ఒకావిడ స్నేహితురాలితో:– 'అదేమిటమ్మా, మా పక్కింటావిడ అస్తమానం మొగుణ్ణి సాధిస్తూనే వుంటుంది! పోని ఇంట్లో ఏదో ఏడుస్తుందను కోవచ్చు! ఊళ్ళో వాళ్ళందరి దగ్గరికి వెళ్ళి మొగుణ్ణి తిట్టి పోస్తుంది. తప్పుకాదూ? నేను చూడు; మా ఆయనంత చవట దద్దమ్మ ఇంకోడులేడు. అయినా బయటెక్కడన్నా ఆ మాట చెప్పుకుంటున్నానా?'

మీ రివ్వ దేమైనా చేస్తే నేనేం చెయ్యగలను?'

'క్షమించండి! అలా అర్థం చేసుకోకండి దయచేసి! ఇందాకటి వరకూ మా ఫ్రెండూ నేనూ కలిసి కబుర్లు చెప్పుకున్నాం. వెన్నెలవస్తే కాస్సేపు కూర్చుని పోవచ్చు గదా అని వొక్కతెనూ వుండిపోయాను. వెన్నెలకి బదులు వర్షం వచ్చింది.'

'అంత ఇష్టమా మీకు వెన్నెల?' రేఖ ముఖంవేపు చిరునవ్వుతో చూస్తూ అన్నాడు. బదులుగా ఆమె కళ్ళతో నవ్వి అవునన్నట్లు తల పంకించింది.

'ఎలా వుంటుందేమిటి మీకు వెన్నెల?'

అతని చిలిపితనం ఆమె నాకర్షించింది.

'అంటే?'

'చల్లగానా?—వేడిగానా?'

'చలీవేడీ ఏమిటీ? — హాయిగా వుంటుంది వెన్నెల.'

'అయితే మీకు వెన్నెల గురించి ఏమీ తెలియదన్నమాట.'

'మీకు తెలుసేమిటి?'

'ఓ!—'

'అయితే చెప్పండి!'

'అందమైనఅమ్మాయిలతో వెన్నెల గురించి మాట్లాడకూడదు.'

'మాట్లాడితే—'

'మాట్లాడితే దాన్ని 'ప్రేమ' అంటారు—'

చటుక్కున ఆమె అతన్ని కోపంగా చూసింది. అతను గ్రహించాడు.

'కోప్పడకండి మరి. నా కారులో కూర్చున్నారు కనుక కాస్త ఫ్రీగా మాట్లాడుతున్నానంతే! మీకు ఇబ్బందిగా వుంటే—'

'వుంటే?—'

'కారు ఆపుచేస్తాను దిగిపోదురు గాని.'

ఈ జవాబుతో రేఖకి వుడుకుమోత్తనం వచ్చింది.

'అయితే ఆపండి దిగిపోతాను!'

వెంటనే అతను కారు ఆపు చేశాడు. ఇది వూహించని రేఖ తత్తరపడింది.

'ఆపాను, దిగిపోతారా?'

ఆమె సంశయిస్తూ అంది 'దిగిపోతాను'.

'కాదు. దిగి తడిసిపోతారు. పైట వున్నది వెన్నెలకాదు. వర్షం.'

'నే నెలాపోతే మీకేం? కారుందిగా మీకు. హాయిగా తడవకుండా వెళ్ళండి.'

'తడిస్తే చలేసి రొంపపడుతుంది. అలా వుడుక్కుంటే వేడెక్కరు.'

ఆమె తలుపు తెరవబోయింది.

'పే చెయ్యకుండా దిగిపోడం న్యాయంకాదు.'

'ఆమె వులిక్కిపడింది. 'టాక్సీనా యిది. అయితే నేను దిగను. ఇంటి దగ్గరే డబ్బు అన్నీ పే చేస్తాను.' 'టాక్సీ డ్రైవరు తన్ను అంతలోకువ కట్టి మాట్లాడతాడా అని కోపంతో వలించిపోతూ అంది రేఖ. అతను కారు కదలించాడు.

'పర్సు మరిచి పోయారేమిటి?'

'కాదు. ఏం మరచిపోయానో యింటిదగ్గరే చెబుతాను.'

'అదీ మరిచి పోయినట్టున్నారు. కాస్త జ్ఞాపకం చేసుకోండి - ఏం మరిచిపోయారు?'

'షటప్!'

'షటప్పా?'

'అతిగా మాట్లాడితే మీ యజమానితో చెప్పి పనిలోంచి డిస్మిస్ చేయిస్తాను.'

'అయితే చెప్పండి. నేనే దీనికి యజమానిని.'

'మిస్టర్! జాగ్రత్త. డ్రైవింగ్ లైసెన్సు పీకించెయ్యగలను.'

'సారీ! నాకులేదు. మీరు పొరబడుతున్నారు. ఇది టాక్సీకాదు.'

'పే చెయ్యమనడానికి లేనిసిగ్గు టాక్సీఅని చెప్పకుంటే వచ్చింది కాబోలు.'

'ఇది మీ రెండో పొరపాటు. నేను పే చెయ్యమన్నది డబ్బు కాదు థాంక్స్.'

అతని మాటకారితనం, చొరవ ఆమెకాశ్చర్యాన్ని కలిగించాయి. అతను పెదాలు విరిచి చిరునవ్వు తయారు చేయడం చూడగానే కోపమంతా పోయి ఆమెకు వెన్నెలంత హాయి కలిగింది.

నొచ్చుకుంటూ మెల్లగా అంది. 'సారీ! నాకు ఎలా బిహేవ్ చెయ్యాలో తెలీదు. ఏమీ అనుకోకండి!'

'ఇప్పుడేమీ అనుకోలేదుగానీ, యిందాక మాత్రం మీరు కారెక్కినప్పుడే అనుకున్నాను — మీకు 'బిహేవియర్' తెలియదని'

ఆమె ఆశ్చర్యంగా చూసింది. అద్దంలోంచి వర్షం వెలిసిపోవడం కనబడింది.

'మీ పేరు తెలుసుకోవచ్చా?' అడిగింది.

'చిన్నా.'

'ముద్దు పేరా?'

'ఎవరికి?'

'మీ వాళ్ళకి.'

'మా వాళ్ళంటే?'

'అమ్మా, నాన్నా.'

'వాళ్ళు నాకు లేరు.'

'సారీ!' రేఖ మనస్సు చివుక్కుమంది.

కాస్సేపు యిద్దరి మధ్యా నిశ్శబ్దం నిలిచాక రేఖే మాట్లాడింది.

'ఏం చేస్తున్నారు మీరు?'

'కనిపించడంలా—డ్రైవ్ చేస్తున్నాను.'

'అది కాదండీ—వుద్యోగం!'

'వుద్యోగమా! అది చేస్తే ఇలా వొంటరి అమ్మాయిలకి లిఫ్ట్ లివ్వను. ప్రస్తుతం నేనూ మీ లాగే స్టూడెం

కుని ఇక్కడే యమ్మెస్సీ చదువు తున్నాను.'

'ఇంక ఆపేసెయండి!'

'చదువా! కారా?'

'కారేలెండి. అదుగో ఆ లాండ్రీ షాపు దగ్గర ఆపండి. మా యిల్లు వచ్చేసింది.'

చిన్నా కారు ఆపాడు. రేఖ దిగి ఎంతో కృతజ్ఞతా భావంతో అంది. 'వెరీ మెనీ థాంక్సండి! వీలు చూసుకుని ఎప్పుడేనా ఓ సారి మా యింటికి రండి!'

'అలాగే వస్తానుసరి. గుడ్‌నైట్' అంటూ కారు స్టార్ట్ చేశాడు చీకట్లో అది టార్పెడోలా ముందుకి దూసుకు పోయింది సరాగాల పులకించిన మనస్సుతో రేఖ గేటు వైపు నడిచింది.

● ● ●

ఖాళీ చేసిన కప్పు టీపాయ్‌మీద పెడుతూ అన్నాడు చిన్నా- 'చాలా బాగుంది!'

'కాఫీయేనా?' రేఖ అడిగింది.

'కాదు - యిలా కాఫీ త్రాగడం-' అన్నాడు సమాధానంగా కళ్ళతో నవ్వింది. ఇంకా సిప్ చేస్తున్న రేఖ. చిన్నా ఆమె పెదాల్నీ, కప్పు అంచుని అవి స్పృశించే తీరునీ, చూస్తున్నాడు. తనా కప్పుకి అంచునైతే ఎంత బాగుణ్ణు?- అని ఆలోచిస్తున్నాడు.

కాఫీ ముగించి లేచి రేఖ కిటికీ గోడవైపు నడుస్తూ అంది- 'లేచిరండి! ఇక్కడ్నించి మంచి వ్యూ కనిపిస్తుంది' ఆలోచనమాని చిన్నాకూడా కిటికీ గోడవైపు నడిచాడు.

'మాశారా? సాయంత్రం వెలుగులో సముద్రంఎంతబాగుందో?'

'చీకట్లో యింకా బావుంటుంది.'

'బలేవారే - చీకట్లో కనిపిస్తుందేవిటి?'

'కనిపించదు కాబట్టే బాగుంటుంది నాకు'

'అదేవిటి?'

'సముద్రమంటే నాకు భయం.'

'మిమ్మల్ని చూస్తే నవ్వొస్తోంది!' పళ్ళు బిగిస్తే కళ్ళు నవ్వేయి.

'అవును పాపాయి ఏడుపుకీ ఆడదాని నవ్వుకీ వేళాపాళా వుండదుట'

రేఖ గలాగలానవ్వి, అతన్ని వసివాడిలా చూసి అడిగింది - 'అయితే తమకి సముద్రమంటే ఎందుకో భయం మరి?'

'మా నాన్నగారు సముద్రస్నానం చేస్తూ మునిగి చనిపోయారు.' నిర్లిప్తంగా జవాబిచ్చాడు చిన్నా. దాంతో ఆమె హఠాత్తుగా నవ్వు మరిచిపోయింది, ఆశ్చర్యపోయింది. అతనికి దగ్గరగావచ్చి జాలిగా అంది.

'సారీ చిన్నా!'

కాస్సేపు యిద్దరూ మౌనంగా వుండిపోయారు. తర్వాత అతను యిటుగా తిరిగిచూస్తూ మాట్లాడాడు-

'సముద్రంకంటే ఆ కొండమీద హాస్పిటల్ వ్యూ నాకు చాలా బాగుంది!'





'మీకు బాగానే వుంటుంది. రోజూ చదువుకోసం ఆ ఎత్తు ఎక్కి దిగలేక ఆయాసం వస్తుంది ఎలాంటి చోట కట్టారో చూడండి! ఇంకెక్కడా చోటు దొరకనట్టు—'

'దానికేం?—ఎత్తుగా, చక్కగా, కైలాసంలా వుంది. బాగా ఆలోచించే కట్టారు. ఒకవేళ ఎప్పుడేనా సముద్రం పొంగితే మా నాన్నగార్ని మింగినట్టు, అది రోగుల్ని మింగలేదు.'

వాళ్ళని సముద్రం మింగదు;

ఆ పని చేసేందుకు రోగాలున్నాయి వాళ్ళకి."

"తప్పు! డాక్టర్లున్నారు అనాలి."

"మీదే తప్పు!— వాళ్ళు మింగేది రోగుల్ని కాదు రోగాల్ని."

"మరి వాళ్ళని మింగే దెవరు?"

"ఓర్పు. కాని నేర్పుతో దాన్ని స్వాధీనం చేసుకుంటే మంచి డాక్టరయ్యే అవకాశం వుంది."

"అయితే మంచి డాక్టరయ్యే అర్హతకి వొక అద లక్షణం సంపాదించాలన్నమాట."

ఈ మాటకి రేఖ తెలివిగా ఏదో బదులు చెప్పబోయేంతలో, చిన్నా తన చేతి వాచీ చూసుకుని త్వర పడ్డాడు. "నే వెంటనే యింటికి చేరాలి. మావయ్య ఎదురుచూస్తూ వుంటాడు – వస్తాను మరి" అంటూ కదలబోయాడు.

"ఇంకా ఏడేనా అవలేదు. అప్పుడే యింటికి వెళ్ళి ఏం చేస్తారు?"

"అలా కుదరదు. పంక్చువాలిటీ లేకపోతే మావయ్య వూరుకోడు. ఆయన కాలంతోపాటు నడుస్తాడు. ఇవాళ 6–45 కల్లా యిల్లు చేరకపోతే మావయ్య ప్రవర్తన ఎలా వుంటుందో నాకు తెలుసు."

"మీ మావయ్యంటే అంత భయం వుందా?"

"భయం కాదు–గౌరవం! భక్తి! ఆయనక్కూడా నేనంటే వల్లమాలిన అభిమానం. అందుకే సంసారాన్నంతా హైదరాబాదులోనే విడిచి పెట్టి, నాకోసం వొక్కడూ యింత దూరం వచ్చేసి, నాతోపాటే వుంటూ నన్ను చదివిస్తున్నాడిక్కడ. నిజంగా నాకు ప్రపంచంలో మనస్సుకు మావయ్యంత దగ్గరపడ్డ వ్యక్తి యింకెవ్వరూ లేరు. ఆలోచించిచూస్తే మావయ్యలో ఏదో ఒక తెలియని ఆకర్షణ వుందనిపిస్తుంది."

"చిత్రమైన మనిషిలా వున్నారే మీ మావయ్య!"

"అవును, నిజానికి మావయ్య చిత్రమైన మనిషి అని ఒప్పుకు తీరాలి. 'ఎస్ట్రానమర్' పని చేసి రిటైరయిపోయినా ఆయనలో యింకా ఆ ఛాయలు మిగిలిపోయాయి. సూర్యుణ్ణి, నక్షత్రాల్ని పదేపదే గమనించి కాలాన్ని కాగితాలమీద పరుస్తాడు. ఎప్పుడూ ఏవో రకరకాల గీతలు గీస్తాడు. ఏవేవో మీటర్లని పరిశీలిస్తూ ఆలోచిస్తాడు. రోజూ కాలంతో అలా కుస్తీపడుతూ వుంటాడు. వొక్క మాటలో చెప్పాలంటే మావయ్యని 'కాలానికి బానిస' అనాల్సొస్తుంది. అసలు ఆయన కాలాన్ని కొలుస్తాడు గడియారాన్ని కాదు – భక్తుడిలా, ఆయనకు కాలమే 'దైవం' మావయ్య చర్యల్లో మరీ విచిత్ర మనిపించే దొకటుంది – ప్రతి వుదయం ఆయన తన డ్రాయింగు రూములో టేబులుమీదున్న 'బిగ్ బెన్' టైంపీసుని అనురాగంతో ముద్దు పెట్టుకుంటాడు! భక్తితో ఆరాధిస్తాడు! అలాగని మావయ్యకి పిచ్చి వుందనుకునేరు. అసలు నన్నడి





గితే మావయ్య కాలం అంశంతో పుట్టేడంటాను." మళ్ళీ చేతి వాచీ చూసుకున్నాడు. "మాటల్లో మరిచిపోయాను. ఇక క్షణం ఆలస్యంచేస్తే లాభంలేదు. వెళ్తానుమరి!" అతను కదిలాడు. "అన్నట్టు వచ్చే శనివారం సాయంత్రం అయిదింటికల్లా సిద్ధంగా వుండాలి మీరు. మా యింటికితీసుకు వెళ్ళి మావయ్యని మీకు పరిచయం చేస్తాను. మర్చిపోకండి! వస్తానూ!" అంటూ మెట్లుదిగాడు. రేఖ అతన్ని కారుదాకా సాగనంపింది. లోపలికి నడిచే రేఖ ముఖంలో కాంతిరేఖలు, హృదయంలో సంతోష రేఖలు వుజ్జ్వలంగా ప్రజ్జ్వరిల్లేయి.

విచిత్రమైన యీ పరిచయానికి, ఆమెలో అంబరమంత సంబరం కదిలింది. మంచిచెడ్డలు తెలియనివ్యక్తితో ఆమె యిలా కలుపుగోలు తనంతో మసలడం, మాట్లాడ్డం మొదలైనవి యిప్పటివరకూ సినిమాలోలాగ అనిపించినా – రేఖ విషయంలో మాత్రం యిది పరిమితి దాటడం కాదు. దుష్ప్రవర్తన అంతకన్నా కాదు. ఎందుకంటే రేఖ స్వతహాగా 'అతి మంచి అమ్మాయి. చెవులకి రింగులు పెడుతుంది. మంచి చీరె, జాకెట్టూ ధరిస్తుంది. పమిట సరిగ్గా వేసుకుంటుంది. కల్మషం లేకుండా అందరితోనూ సరదాగా కబుర్లాడుతుంది. చిన్నాకి లాగా ఎవరికేనా చనువిస్తుంది. కాఫీ కూడా ఇస్తుంది. నిరంజనానికయితే హృదయంకూడా యిచ్చింది. పైగా ఆమె ఒంటరిగా అక్కడికీ, యిక్కడికీ తిరగదు. సాధారణంగా నిరంజనం తోడు వుంటాడు. కాపోతే తెగ మాట్లాడేసే వొక దురలవాటు మాత్రం

---

● ఇద్దరు స్నేహితులు రెండేళ్ళ తరవాత కలుసుకున్నారు.

ఒకడు : "ఏమోయ్. ఈ మధ్య బాగా డబ్బు సంపాయిస్తున్నావుటగా?"

రెండోవాడు : "అవునోయ్. లాటరీలో డబ్బొచ్చింది. దాంతో వ్యాపారం మొదలెట్టాను."

మొదటివాడు : "అయినా, నీలో అట్టే మార్పు రాలేదే?"

రెండోవాడు : "రాకేం? ఇదివరకు నే నేది మాట్లాడినా వినే వాళ్ళకి చిరాగ్గా వుండేది. ఇప్పుడు నేను మాట్లాడితే చాలు, హాస్యమైపోతోంది. ఇదివరకు నేను నోటికొచ్చినట్టు పేలేవాణ్ణి. ఇప్పుడు నేను కుండ బద్దలు కొట్టినట్టు నిర్మొగమాటంగా మాట్లాడుతున్నాను."

రేఖకి వున్నదని నిరంజనం తరచూ అనుకుంటూ వుంటాడు.

రేఖ చదివే ఆ మెడికల్ కాలేజీలోనే నిరంజనం కూడా స్టూడెంటు. రేఖకి ప్రేమంటే ఎంత యిష్టమో, సరదా కబుర్లంటే అంత యిష్టం. కనుక ఆమె చిన్నాతో పరిచయాన్ని, నిరంజనంతో ప్రేమలాగా గట్టిగా పెంచుకోదలిచింది.

రేఖ గదిలోకి అడుగు పెట్టగానే, ఆమెకోసం ఎదురు చూపులు చూసి చూసి విసిగెత్తిపోయి ఈజీ చైర్‌లో అనీజీగా కూర్చున్న నిరంజనం కన్పించాడు. ఎదురుగ్గా గ్రీకు దేవతలా నిలబడివున్న రేఖని చూడగానే నిరంజనానికి ఎప్పటిలాగే మతిపోయింది. అప్పుడామె అమృతాంజనం రాసినట్టు నిరంజనం నుదుటిమీద తన చేతుల్తో ప్రేమగా నిమిరింది.

● ● ●

రెండ్రోజులకల్లా శనివారం సాయంత్రం రానే వచ్చింది. కాని, వస్తానన్న ప్రకారం చిన్నా రానే లేదు. తెగని నిరీక్షతో అవస్థ పడుతూన్న రేఖ మాత్రం అతని రాక కోసం పడిగాపులు పడుతూ, బాల్కనీ పిట్టగోడ నానుకుని అలాగే వుండిపోయింది. కాని ఆ సాయంత్రం అలాగే వుండిపోలేదు. కాస్సేపటికి సాయంత్రాన్ని తంమేస్తూ చీకటి వచ్చింది. చీకటితో పాటు రేఖకి విసుగుదల వచ్చింది. అలా వచ్చిన విసుగుదల మూడ్రోజుల వరకూ పోలేదు. చివరకు మూడో రోజు సాయంత్రం విసుగుతో విసిగెత్తిపోయాక, ఆమె కంటికి దూరంగా రోడ్డుమీద తన యింటివేపుగా నడిచి వస్తున్న చిన్నా కనిపించాడు వెంటనే స్నేహంలో బలం శరీరమంతా పాకింది. ఒక్క వుదుటున ఆమె మెట్లవేపు పరిగెట్టింది క్షణంలో మేడదిగి క్రిందికివచ్చి అతన్ని కారిడార్‌లో కలిసింది. తీరా అతనితో ఏదో మాట్లాడబోయేసరికి ఆమెకి కోపం జ్ఞాపకానికొచ్చింది. వెంటనే ముఖంలో లేని విముఖత తెచ్చిపెట్టుకుని వెనక్కి తిరిగి చకచకా మేడెక్కేసింది. రేఖ చేష్టకి చిన్నా చిన్నగా నవ్వుకుని ఆమెను అనుసరించాడు.

పిట్టగోడ అంచుమీద మోచేతులు మోపి దూరంగా చీకటిలోకి చూస్తూ భావాల్ని దాచుకునే ప్రయత్నం చేస్తున్న రేఖ భుజం మీద చిన్నా చెయ్యి పడేసరికి గిరుక్కున తలతిప్పి అతని ముఖంలోకి కోపంగా చూసింది. చిన్నా ముఖం చిన్నబోయి వుంది. అతని రెండు కళ్ళు దీనంగా చూస్తున్నాయి. అతనిలో యిప్పుడు పాత గంభీరత లేదు. చీకటి మూలంగా యీ భావాల్ని ఆమె గుర్తించలేకపోయింది. "కారులో రాలేదేం?" అని అడగాలని మనస్సులోవున్నా తనువంతా ప్రవహిస్తున్న కోపం రేఖని మరోలా మాట్లాడించింది.

"మీరు చెప్పిన శనివారంమూడు రోజుల క్రితమే వెళ్ళిపోయింది. కాఫీ



యీ పాటికి బాగా చల్లారిపోయి వుంటుంది. నేను రాదల్చుకోలేదు."

చిన్నా చిన్నబాధ నవ్వొకటి విసిరాడు. కాని అతని చుట్టూరా యింకా చీకటే కాబట్టి, అనవ్వు కిప్పుడు ప్రయోజనం లేకపోయింది.

"టైమంటే గౌరవం మీ మావయ్యకి, మీకే కాదు. నాకూ వుంది. నేను రాను."

"థాంక్స్! వస్తానంటారేమోనని భయపడ్డాను. నాకు శ్రమతప్పించారు"

అతను పిట్టగోడదాకా జూకా మల్లెతీగె వేపు నడిచాడు. ఇప్పుడు లోపలి గదిలోంచి వచ్చే దీపపుకాంతి అతని ముఖంమీద పడింది. కట్టలు తెగిన కోపంతో విసురుగా బదులు చెప్పబోయిన రేఖ వొక్కసారిగా చిన్నా ముఖాన్ని దీపం వెలుగులో చూడగానే నివ్వెరబోయింది. సరదా, చురుకుదనం హరించిపోయిన చిన్నా ముఖంలో వున్న భావాల్ని సనసన్నగా గ్రహించగానే ఖిన్నురాలైంది. అలా కొత్తగా కనిపించే చిన్నా ముఖాన్ని చూసి తత్తరపడిన రేఖ మెల్లగా దగ్గరికివచ్చి అంది: "ఏం జరిగింది?"

"అనుకున్నది జరగలేదు. మీకు నేనిప్పుడు చెప్పగలిగిందల్లా వొక్కటే; క్షమాపణ!"

"ఏమిటా జరగనిది?"

"శనివారం సాయంత్రం మీరూ, నేనూ, మావయ్యా కలిసి కాఫీ త్రాగుతూ కబుర్లు చెప్పుకోవటం." వ్యగ్రంగా అన్నాడు.

"ఇంతకీ ఏం జరిగింది?"

"మీకీ రెండు ప్రశ్నలే వచ్చుననుకుంటాను"

"ముందు జరిగిందేవిటో చెప్పండి!—"

"రెండు రోజులుగా రాత్రీ, పగలూ కష్టపడి ఆలోచించినా, మీ యీ ప్రశ్నకి సమాధానాన్ని సిద్ధం చేసుకోలేకపోయాను — నేను చెప్పలేను." అతని గొంతు వణికింది.

"దయచేసి త్వరగా జరిగిన విషయం చెప్పండి!" ఆమె ప్రాధేయపడ్డంలో కూడా కంగారు వుంది.

అతను తలతిప్పి ఆమె కేసి చూశాడు.

"క్లైంపీసు పోయింది ఘోరం జరిగిపోయింది." అతనిలో కరిగిపోయిన గంభీరత అంతా కన్నీరై కట్టలుతెగి ప్రవహించింది.

చిన్నా భుజంమీదికి తల వాల్చుకుని నిశ్శబ్దంగా లోలోపలే గుండె పగిలేలా ఏడుస్తున్నాడు. రేఖకి జరిగేదంతా అగమ్యగోచరమైంది. అసలు విషయం చెప్పలేక చిన్నా ఎందుకిలా పసివాడిలా ఏడుస్తున్నాడో ఆమెకి అర్థం కాలేదు. అయినా అతని పరిస్థితికి జాలివేసింది. నిశ్శబ్దం ఆసరాతో రెండు క్షణాలు కష్టపడి, అతను ఏడుపు నిలదొక్కుకున్నాక, మళ్ళీ పాత ప్రశ్నే అడిగింది. "ఏం జరిగింది?"

'మావయ్య చచ్చిపోయాడు.' అతను నిశ్చలంగా జవాబిచ్చేడు. ఇప్పుడతను ఏడవకుండా ఎందుకో నిశ్శబ్దంగా వున్నాడు — ఒకవేళ గుండె పగిలే రోదనలో కన్నీళ్ళన్నీ ఖర్చయిపోయాక ఏర్పడిన నిశ్శబ్దమేమో అది.

ఊహించని అతని సమాధానం విన్నాక చలించిపోయిన రేఖ వణికే పెదాల్లో అతి కష్టంమీద 'ఎలా పోయారు?' అని మాత్రం అనగలిగింది.

కోల్పోయిన గంభీరతని కూడ దీసుకుంటున్నట్లు చిన్నా మాట్లాడాడు—

'కొన్ని నిజాలు తల్చుకుంటే నిజంగా నవ్వొస్తుంది ఆలోచిస్తే వాటిలో మావయ్య పోవడం కూడా వొకటేమో ననిపిస్తోంది. అసలు చనిపోవడానికి ముందు ఆయన ప్రవర్తన ఎంతో వింతగా తోచింది నాకు. ఆ రోజు మీతో కాఫీ తాగి యింటికి వెళ్ళేసరికి దేనికోసమో యిల్లంతా కంగారుగా వెదుకుతూ కనిపించాడు మావయ్య. ఏమిటని అడిగితే రోజూ తను ఆరాధించే బిగ్‌బెన్ టైంపీస కనిపించడం లేదన్నాడు. నేను చూశానేమోనని అడిగాడు. నేను చూడలేదు. అమాటే చెప్పాను. అయినా – ఆ గడియారం మావయ్య ఆరో ప్రాణమని నాకు తెలుసుననీ, నేను దాన్ని తాకడానికేనా సాహసించననీ ఆయనకి తెలును. అప్పుడప్పుడు క్లబ్బులకీ, మీటింగులకీ గనక వెడితే దాన్ని కూడా తనతోబాటే తీసుకు వెళ్తాడు. అదంటే ఆయన కంత ప్రాణం. దానికోసం యిద్దరం రెండురోజులిల్లంతా వెదికినా అంతుచిక్కలేదు. చివరికి ఆ గడియారం పోయిందని నిర్ధారణ చేసుకున్నాక మావయ్య ఎంతగానో దిగాలు పడిపోయాడు. నాకు అలాగ మావయ్యని చూసేసరికి మొదటిసారిగా ఆయనమీద జాలివేసింది. చివరికాయన – 'ఒరే చిన్నా! నా టైంపీసు పోయిందిరా! నా సర్వస్వం పోయిందిరా!'– అని, బెంగపెట్టుకున్న చంటిపిల్లాడిలా బావురుమని ఏడిచాడు. ఆ క్షణం మావయ్యపడ్డ బాధ ఎంతటిదో నాకు తెలును. ఇంగ్లండులో 'బిగ్‌బెన్' కంపెనీ అంతా సొంతం చేసిపెట్టినా, స్విట్జర్లాండంతా రాసిచ్చినా కూడా తీరే బాధ కాదది. ఎంతో ప్రయత్నించి కూడా నేనాయన్ని ఓదార్చలేకపోయాను. మావయ్య బాధనీ. భావాల్నీ అప్పుడే నేను అఖరిసారిగా చదవగలిగాను. ఆ రోజంతా ఆయన తిండి నిద్ర లేకుండా ఎండిపోయాడు. తీరని మనస్తాపంతో కృశించి పోయాడు. పిచ్చివాడిలా, తను కాగితాల గీతల్లో మలిచిన కాలాన్ని చించి పోగులు పెట్టాడు. తెల్లారాక చూస్తే తడికళ్ళతో డ్రాయింగురూములో ఆ గడియారం లేని ఖాళీ టేబిలుమీద తలవాల్చి ప్రాణాలు వదిలేసి కనిపించాడు. అయన మీదపడి నేను చాలాసేపు ఏడిచాను. ఏం లాభం? గతించిన





కాలంలాగే మావయ్యా తిరిగిరాలేదు. కాలమే మావయ్యనలా కాలం చేయించడంతో నా కప్పుడు కాల చక్రం ఆగిపోయి నట్టనిపించింది. ఏమైతేనేం – టైంపీసు పోయింది. మావయ్యా పోయాడు.'

సముద్రంమీద పేరుకున్న చీకటిలోకి నిరామయంగా చూస్తూ మాట్లాడుతున్న చిన్నా, వొక్కసారి ఆగి రేఖ వేపు చూశాడు. ఆమె ముఖంలో విషాదాశ్చర్యాలు కూడుకొని వున్నాయి.

'తీరాచూస్తే నిన్న ఆ టైంపీసు కారులో బాక్‌సీటు వెనుకనున్న విండోలో కనబడింది. హఠాత్తుగా దాన్నక్కడ చూసేసరికి నాకు మతిపోయింది ఏడుపొచ్చింది. దానిమీద ఎక్కడలేని కోపం వచ్చింది. నాకోసం ఎంతగానో తాపత్రయ పడేందుకు మిగిలివున్న వొక్క వ్యక్తినీ నాకు దూరంచేసి, అది నన్ను నిస్సహాయుణ్ణి చేసింది. ఇక ఆపాడు గడియారంలో టైము చూసుకోడానికి అసహ్యమేసింది. భరించలేక ఒళ్ళు తెలియని కోపంలో దాన్ని ముక్కలు ముక్కలుగా చితగ్గొట్టి, డ్రైనేజ్‌లో పారేశాను.' ముగించాడు.

రేఖ యిదంతా కళ్ళప్పగించి వింది. విన్నాక ఆమె కళ్ళు ఇప్పుడు చెవుల్లా మాటలు వినాలనే ప్రయత్నంతో చూస్తున్నట్లున్నాయి. ఆమె పెదాలు కదలిక మాని నిద్రపోతున్నట్లున్నాయి. అలా వున్న రేఖ ముఖాన్ని రెండు క్షణాలపాటు చూశాక, చిన్నాలో మళ్ళీ బాధ కదిలింది. అలాంటి 'బాధ చిన్నా'ని రెండు క్షణాలపాటు చూశాక రేఖ హృదయం ఎనలేని జాలితో రెపరెప లాడింది. అప్పుడు రేఖ మెల్లిగా అతన్ని ఓదార్చే ధోరణిలో అంది—'పోనీండి చిన్నా! జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇప్పుడిక బాధపడి ఏం ప్రయోజనం చెప్పండి? దయచేసి నా కోసమేనా అలా బాధపడ్డం మానేయండి. మీ బాధను చూస్తూ నేను సహించలేను.'

'మరి నా ఒంటరితనాన్ని చూస్తూ—?' దీనాతిదీనంగా అడిగాడు. అతని ప్రశ్నలో కోరిక మిళితమైవున్నా, కొట్టొచ్చినట్టు కనబడే దైన్యీభావం దాన్ని కప్పేసింది. మగాడి ముఖంలో ధైర్యం బాగున్నంతగా దైన్యం బాగుండదు కనుక రేఖ ఆ చూపులకి తట్టుకోలేకపోయింది. మనస్సు విచక్షణని నిర్లక్షించడంతో 'నేనుండగా మీరు వొంటరి వారెలా అవుతారు?' అని వూరడించింది. ఊరడించేటప్పుడు అతని భుజంమీద చెయ్యి కూడా వేసింది. అప్పుడు చిన్నా క్రమంగా స్తిమితానికి రాగలిగేడు.

● ● ●

ఆ మర్నాటినుండీ యిద్దరి పరిచయం బలంగా మారి, వాళ్ళ మనస్సుల్లో శ్రద్ధగా పునాదులు నిర్మించడం మొదలు పెట్టింది. ఆ సందర్భంలో వారిరువురూ రేఖ ఇంట్లో

వెలువడింది !

త్వరపడండి !

మీ అభిమాన రచయిత్రి

యద్దనపూడి

సులోచనారాణిగారి

సెక్రటరీ

- పేజీలు పెరిగినందున రేటు ఎనిమిది రూపాయలు జేసినా పాఠకుల సౌకర్యార్థం ఆగస్టు 15 వ తేదీలోపు మాకు నేరుగా రు. 6/- లు పంపినవారికి రిజిష్టర్డు పోస్టులో పంపించగలము. వి. పి. పి. పద్ధతి లేదు.
- 15 కాపీలు తీసుకొన్న ఏజంట్లకు 33 1/3% కమీషన్ ఇవ్వబడును.



నవభారత్ బుక్ హౌస్,

ఏలూరు రోడ్ - విజయవాడ-2


వాల్కని పిట్టగోడ అంచున, ఎగ బాకిన జూకా మల్లితీగె సరసన, 'సరసమైన' సరదా కబుర్లెన్నో చెప్పుకోడం చాలాసార్లు జరిగింది.

ఒకరోజు అదే ప్రదేశంలో, రేఖతో చిన్నా — "జూకా మల్లి పువ్వులు బావుంటాయి!" అన్నాడు. మరుసటి రోజు — "జూకా మల్లె పువ్వులు మీ ఎడమ జెళ్ళో యింకా బాగుంటాయి!" అన్నాడు. తర్వాత రోజు—"మీ చెవులకి రింగులకంటే జూకాలు బావుంటాయి." అన్నాడు. ఆ తర్వాత రోజు—"జూకాలు పెట్టు కోండీ, బావుంటారు!" అన్నాడు. మర్నాడు, "మీకు పాలపిట్ట రంగు పువ్వుల చీరె బాగుంటుంది రేఖా!" అన్నాడు. తర్వాత "నీ పేరు అయ్యటి పేరు సుమా!" అన్నాడు. వీటితో రేఖ మనస్సులో సంతోషం సంబరంగా గంతులు వేసింది. మరుసటి సాయంత్రం వాళ్ళిద్దరూ బీచ్ కి వెళ్ళి కెరటాల గురించి మాట్లాడుకున్నారు. ఓ రాత్రి సినిమాకి వెళ్ళి, సినిమాలో మనుషులు ఆలస్యంగా ఒళ్ళో వేరతారనీ, ఇంకా ఆలస్యంగా ప్రేమించుకుంటారనీ జోక్ గా మాట్లాడుకుని నవ్వుకున్నారు.

క్రమంగా యిలా చిన్నా రేఖల చనువు, ఆడదాని తొలి యవ్వనంలా శీఘ్రగతిని, ఏవుగా పెరిగిపోయింది. ఈ సంగతి నిరంజనానికి చూచాయగా తెలిసినప్పటికీ అతనామె సమక్షంలో అలవాటు ప్రకారం ప్రేమ తప్ప మిగతావన్నీ మరచి పోయేవాడు కాబట్టి యిబ్బంది లేక పోయింది.

ఇలా వుండగా, చిన్నా ఒకరోజు రేఖతో మాటల సందర్భాన మళ్ళీ మావయ్య గురించి మాట్లాడేడు.

"ఇంతకీ మావయ్య తాలూకు పెద్ద నిజం నిన్న తెలిసింది నాకు. అప్పుడు నేను చాలా పొరబడ్డాను" ఆమె ముఖాల్ని చూస్తూ అన్నాడు

"పొరబడటం ఏమిటి ?"

"అవును పొరబాటే! మావయ్య చనిపోవడం గురించి నేనూహించినదంతా నిజంకాదు. నిన్న పాతపుస్తకాల మధ్య అయన డైరీ కనిపిస్తే తీసి చదివాను."

"చదివితే ?" ఆమె ఆత్రుతగా అడిగింది "ఏం తెలిసింది నీకు ?"

చిన్నా యిందాకటి లాగే చూస్తూ చెప్పాడు,

"ఏమిటా? మావయ్యకో చిత్రమైన గతం వుంది. నేననుకున్నట్టుగా ఆయన ప్రేమించింది కాలాన్ని కాదు రేఖా! కామాక్షిని."

రేఖ దిమ్మెరబోయింది.

"కాని కాలంలాగే కామాక్షి కూడా తిరిగి మావయ్యని ప్రేమించలేదు. ఆయనతో బాగా పరిచయాన్ని పెంచుకున్నాక తను మరో వ్యక్తిని ప్రేమిస్తున్నట్టుగా చెప్పిందిట. పాపం పిచ్చి మావయ్య! ప్రేమంటే అదేనేమో అనుకున్నాడు. కాని కామాక్షి అది స్నేహం అని చెప్పిందట. అసలింతకీ పిటీ ఏమిటంటే, చివరికంత మోసం జరిగినా కూడా మావయ్య ఆమెని తనింకా ప్రేమిస్తూనే వున్నట్టు డైరీలో రాసుకున్నాడు. రాసుకోడమే కాదు. ప్రాణాలు వదిలేవరకు అంతర్గతంగా ఆమెని ప్రేమించాడు. ఇంతకీ డైరీలో నేను గ్రహించిన నిజమేమిటంటే ఆయన ప్రాణాలు తీసిన బిగ్ బెన్ క్లైపీసుని మావయ్యకి, ఆవిడే పెళ్ళి కానుకగా యిచ్చిందట."

కాస్సేపటికి దిమ్మెరబోయిన రేఖ బొమ్మయిపోయి వింది. నెమ్మదిగా తేరుకున్నాక అంది – "ఆశ్చర్యంగా వుంది!"

"కాదు మరి!"– అని చిన్నా అన్నాడేగాని, నిజంగా రేఖ అలా ఆశ్చర్యపడినందుకు గల కారణం అతనికి తెలియదు.

మరో పావుగంటసేపు అతను రేఖతో కబుర్లు చెప్పాడు. కానిఆమె అంతరంగం దీర్ఘాలోచనకి లోబడిపోవడం వల్ల, రేఖ చిన్నా మాటలన్నిటినీ భౌతికంగా మాత్రమే వినగలిగింది. చివరికి 'గుడ్ నైట్' చెప్పి చిన్నా వెళ్ళిపోయాక ఏదో కొత్త చైతన్యం వొంట్లో ప్రవేశించినట్టయింది రేఖకి. అప్పుడు రేఖ జూకా మల్లెతీగె వేపు నడిచి, చేతివేళ్ళతో సుతారంగా తీగె ఆకుల్ని పిరుస్తూ యిలా ఆలోచించింది.

ఆలోచించినకొద్దీ తనకు విపరీతమైన భయం వేస్తోంది — చిన్నా జీవితం అతని మావయ్య జీవితాన్ని పోలగలదేమోనని. ఒకవేళ చిన్నా గాని తన్ను ప్రేమించే వుద్దేశంతో

వున్నట్టయితే యీ అనుమానం నిజం కావడం తప్పకుండా నిజం కావచ్చు. అయినా చిన్నా తన్ను ప్రేమిస్తున్నాడని తనెందు కనుకోవాలి? ఏమో!- ఒకవేళ ప్రేమిస్తున్నాడేమో? అమ్మో!!—ప్రేమిస్తే, ఇంకేమన్నా వుందా! నిరంజనం? — తన ప్రేమంతా దోచుకున్న నిరంజనం?- తనకి బాగా తెలుసు. ప్రేమకి అనుభవంకంటే వున్నతస్థాయి లేదని. తన విషయంలో అది నిరంజనం దగ్గర మాత్రమే వుంది. మరిప్పుడు చిన్నా తన్ను ప్రేమిస్తే తనేమిటి చెయ్యడం?—ఏమిటో! — ఏమీ తోచకుండా వుంది. అసలు తను చిన్నాతో అంత చొరవగా ప్రవర్తించడమే దీనికి కారణమేమో? అయినా తను మాత్రం ఏం చెయ్యగలదని? అప్పట్లో అతని దైన్యం తనని అన్నీ మరచిపోయేలాచేసి, చిన్నా చిద్విలాసానికీ, సరదా కబుర్లకీ తన్ను అకట్టివేసింది. అప్పుడు చిన్నా తన అందాన్ని గూర్చి ఎంతో గొప్పగా మాట్లాడుతుంటే కళ్ళముందు ఎంత వున్నతంగా కనిపించాడు? స్త్రీకి తన అందం గురించి గొప్పగా మాట్లాడే మగాళ్ళంతా అలాగే కనిపిస్తారు కాబోలు! ఎందుకో పూర్తి విషయం తెలుసుకోకుండా అతన్ని మరోలా అర్థం చేసుకుని తప్పటడుగు వేశానేమో ననిపిస్తోంది. నిజమేనేమో? ఎందుకంటే 'తక్కువ తెలుసుకోవడం, ఎక్కువ అర్థం చేసుకోవడం ఆడవాళ్ళ సహజ లక్షణం' అని నిరంజనం తనతో ఒకసారి చెప్పినట్టు జ్ఞాపకం కూడా. ఏమైనా యిక చేయగలిగిందల్లా వొక్కటే— వచ్చేనెల్లో నిరంజనంతో నిశ్చయమైన తన పెళ్ళి గురించి, రేపే చిన్నాకి విదితంచేసి, అతని స్నేహానికి శాశ్వతంగా 'గుడ్‌బై' చెప్పడం మంచిది. కాని — ఎలా చెప్పేది? ఇన్నాళ్ళూ తన వుత్సాహానికి టానిక్‌లా తోడ్పడ్డాడు. ఇన్నాళ్ళూ 'మావయ్య' పోయాక తనే 'మావయ్య'ంత అసరా అనుకున్నాడు. ఇంకా ఏమనుకుంటున్నాడో ఏమో! పిచ్చి చిన్నా! ఇంతకీ రేపు తను అతనికి 'గుడ్‌బై' ఎలా చెప్పగలదు? చెప్పి అలవాటులేని అతని జాలి చూపులకి తను మళ్ళా ఎలా సిద్ధపడగలదు? పోనీ ప్రయత్నించి సిద్ధపడితే?— ఏమనుకుంటాడో? ఏమనుకుంటాడు? విపరీతంగా బాధపడతాడు. వాళ్ళ 'మావయ్య' పోయినప్పటిలా భుజం మీదికి తలజార్చుకొని ఏడుస్తాడు. చివరికి తన్ను హృదయమూ, సంస్కారమూ లేని స్త్రీగా జమకడతాడు. అమ్మో! వీటన్నిటికీ తనెలా సిద్ధపడడం?

ఏమైనా ప్రేమనీ, చక్కటిముందు జీవితాన్నీ జీవితమంతా కలిసి బ్రతకడానికి ఎన్నిక చేసుకున్న నిరంజనాన్ని కేవలం 'చిన్నా' స్నేహం కోసం తను వదులుకోలేదు. ఏమైనాసరే రేపే తను చిన్నాకి 'గుడ్‌బై!' చెప్పేయాలి.



ఆ రాత్రి ఎన్నో కలలు, ఎన్నో ఆలోచనలు, రేఖ నిద్రని మొదటిసారిగా పాడుచేశాయి.

● ● ●

అవ్వాళ చంద్రుణ్ని మేఘంచాటు చెయ్యక పోయినా బీచ్‌లో వెన్నెల కురవలేదు. రాబోయే అమావాస్యకి సూచనగా ఆకాశం మధ్యగావున్న వెన్నెల కురవని చంద్రుడు రేఖలా వున్నాడు.

బీచ్‌లో చిన్నా పక్కన కూర్చున్న రేఖమాత్రం చంద్రరేఖలా కాకుండా చంద్రుడులేని సముద్రంలా వుంది. వాళ్ళిద్దరూ చాలా సేపట్నుంచీ ఏదో మాట్లాడుకుంటున్నారు.

'ఏమిట్రేఖా! ఈరోజు హుషారేం లేకుండా అలా వున్నావేం?'

'వెన్నెల్లేదుగా—'

'హుషారుగా వున్నప్పుడల్లా వుంటోందేవిటి వెన్నెల?'

'చుట్టూ లేకపోయినా మనస్సులో వుండేది. ఇవాళ మనస్సులోకూడా లేకుండా పోయింది.'

'ఎక్కడివీ బరువు మాటలు?'

'వేళాకోళం కాదు చిన్నా! నిజం. నే నిప్పుడెంత బాధపడుతున్నానో నీకు తెలియదు.'

'ఏమని చెప్పను? నాకెలా మాట్లాడాలో తెలియకుండా వుంది.'

'పోనీ ఏం మాట్లాడాలో తెలుస్తోందా?'

'అది తెలిసిందనే నా బాధ — తెలియక పోయినా బాగుండేది.'

'నీకూ నాలా మాట్లాడ్డం అలవాటై పోయింది. ముందు సంగతేవిటో చెప్పు రేఖా?'

రేఖ తలతిప్పి అంది - 'ఇక మీదట నేను నీ ఒంటరితనానికి తోడుగా నిలిచే అవకాశం లేదు చిన్నా'

'అంటే?-'

'ఏం చెప్పేది చిన్నా? కొద్ది రోజుల్లోనే నీకు నేను దూరమయి పోతున్నాను- నాకు పెళ్ళి కాబోతోంది- ఏమిటో నాకంతా బెంగగా వుంది.' అని రేఖ తప్పని సరిగా మాట్లాడవలసి వచ్చినట్టు ఆగిఆగి చెప్పింది.

ఇది వింటూనే చిన్నా విరగబడి నవ్వేడు. - 'ఎలాగైతేనేం యిన్నాళ్ళకి ఒక గొప్ప జోకు వేశావే! ఇంతా చేసి యిదా సంగతి! ఈ మాత్రానికే అర్థం కాకుండా యిలా బాధపడ్డం దేనికి? హేవ్‌మై హార్టీ కంగ్రాట్స్!' అన్నాడు.

ఊహించని యీ జవాబుకి రేఖ చకితురాలై చూసింది. చిన్నాలో ఎంతో బాధని వూహించిన మనస్సు భరించ శక్యంగాని దిగ్భ్రాంతితో గిజగిజ లాడింది. తన మాటల్లో [illegible]

అతనికి అర్థంకాలేదేమోనని మళ్ళీ అంది— 'కాదు చిన్నా! నేను లేక పోతే యిక నీమీద శ్రద్ధ చూపేందు కెవరు తోడుంటారన్నదే నా బెంగ!'

'అదా నీ వుద్దేశ్యం! బలేదానివే రేఖా! నీ అమాయకతకి థాంక్సు ఎలా చెప్పాలో నాకు తెలియకుండా వుంది. నువ్విలా బెంగపడే అవసరం లేకుండా వుండే ఏర్పాటు ఎప్పుడో జరిగిపోయిందిలే.'

'ఏమిటది?'

'ఇంకేమిటి? — పెళ్ళి. నిన్నే హైద్రాబాదునుండి వుత్తరం వచ్చింది. వచ్చే నెలే నిశ్చయమైంది. మావయ్య అభిమానానికి కృతజ్ఞతగా ఆయన కూతుర్ని జీవితాంతం నా మీద శ్రద్ధ చూపేందుకు సెలక్టు చేసుకున్నాను. ఈ విషయం ముందు నేనే చెబుదా మనుకుంటూండగా, బాధంటూ వంకపెట్టి నీ పెళ్ళి సంగతే ముందు చెప్పేశావ్!' అంటూ లేచి నిలబడ్డాడు ఇది విన్న రేఖ లేవడం మరిచిపోయింది. చిన్నా చెయ్యి వూతగా యిస్తూ— 'పద పోదాం! ఇప్పటికే చాలా ఆలస్య మయి పోయింది.' అన్నాడు. అయినా రేఖ కదలిక లేకుండా అలాగే కూర్చుని వుంది.

'లేలే!—పెళ్ళి గురించి తర్వాత ఆలోచించు కుందువుగాని — రేపే నా ప్రయాణం. బజార్లో నా క్కాస్త పని వుంది. త్వరగా వెళ్ళాలి. లే రేఖా!'

'నువ్వెళ్ళు చిన్నా! ఇక్కడ నాకింకా కాస్సేపు కూర్చోవా లనుంది. నేను తర్వాత వెళ్తాను.' హతాశయైన రేఖ పెదాలు అస్పష్టంగా పలికేయి.

'ఏం? నిరంజనంగానివస్తావని చెప్పా వేవిటి? ప్లెజర్‌టాక్ ప్రోగ్రాంలావుంది జాగ్రత్త. వర్షం రాగలదు. నేనింక వెళ్తాను. పెళ్ళి మళ్ళీ యిన్విటేషన్లో జ్ఞాపకం చేస్తాను. మీరిద్దరూ తప్ప కుండా రావాలి సుమా - వస్తానూ— గుడ్‌బై!' అని యిసుకలో కంగారుగా వంగివంగి అడుగులువేస్తూ కారువేపు కదిలిపోయాడు చిన్నా.

కాస్సేపటికి నిరంజనం రాలేదు గాని, వర్షం మాత్రం వచ్చింది

□□□

## చందాదారులకు మనవి

పాత చందాదారులు తిరిగి చందా పైకం పంపే టప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజింగ్ ఎడిటర్.



## చిత్రరథుని చైత్రయాత్ర

# అవార్డు చిత్రాల ప్రత్యేక సమీక్ష

చలనచిత్ర రంగంలో విశిష్ట కృషిని భారత ప్రభుత్వం అవార్డులతో సత్కరించే సచ్చరిత్రలో నూతనా ధ్యాయం ప్రారంభమైంది.

భారత రాజధానిలో కాక తొలుదొల్త బొంబాయిలో బహూకరణోత్సవం జరిపారు. ఒకప్పుడు రాష్ట్రపతిచే 'అవార్డులయాత్ర మీకు అలవాటయి పోయింది' అన్న ప్రసంశ పుచ్చుకొన్న అక్కినేని నాగేశ్వర రావు ఈ సంవత్సరంకూడా (అనగా 1964 చిత్రానికి 1965లో బహూకృతి స్వీకరణ) రాధాకృష్ణ పండితుని మాటనిలిపారు. అన్నపూర్ణా వారి 'డాక్టర్ చక్రవర్తి' ముఖ్య నటుడుగా రాష్ట్రపతి రజత పతకం పొందిన చిత్రం హీరోగా బహూకరణ నందుకొన్నారు.

వి. ఎన్. ఫిలిమ్స్ 'భక్త రామదాను'కు యోగ్యతా పత్రం లభించింది. నటు, దర్శక, నిర్మాత 'పద్మశ్రీ' చిత్తూరు వి. నాగయ్య, ప్రముఖనటులు శ్రీ ముదిగొండ లింగమూర్తి, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు బొంబాయి మరాఠామందిర్‌లో మన యోగ్యతలను ఇనుమడింప జేశారు.

బొంబాయిలో ఉత్సవం జరిగిన దానికంటె గొప్ప విశేషం - తొలి సారి ఉత్తమ సినీ కథా రచయితకు పారితోషికం లభించడం. మూడు నాలుగేళ్ళ క్రితం సినిమా కవుల ప్రోద్బలంపై, నెహ్రూ ఆసక్తివల్ల, సినీ కథకునికి కేంద్ర బహుమతి ఏర్పాటు చేశారు. అయినా ఇన్ని సంవత్సరాలూ మంచి కథలు లేవంటూ అవార్డే యివ్వలేదు. ఈ సంవత్సరమే 'ఆరోహి' అనే బెంగాలి చిత్రం సినీ కథకునికి (బలైచంద్ ముఖర్జీ) తొలి సారి బహుమతి (యోగ్యతాపత్రం) యిచ్చారు. మొత్తానికి సినీ ఫంక్షన్‌లో కలంకూడా 'కాలర్ యెత్తుకుతిరిగింది'

ఇంతకంటె కూడా విశిష్టమైన విజయం ఒకటి ఈ సంవత్సరం చూడాము. అది సత్యజిత్ రాయ్ స్వీయ చిత్ర 'చారులత'. ఈ మహా దర్శకుని మూడవసారి రాష్ట్రపతి